సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



భవిత భారం..

తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు పిల్లల భవిత భారమవుతోంది. వారు దాతల సాయం కోరుతున్నారు. - 8లో



ప్రజారోగ్యానికి పెద్దపీట

ఈదుపురం, మాణిక్యపురం పీహెచ్‌సీలు ప్రారంభమయ్యాయి. రెండు గ్రామాల కల నెరవేరింది. - 8లో

మంత్రి పరామర్శ



నందిగాం: విశాఖలో దారుణహత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్య కుటుంబసభ్యులను మంత్రి సీదిరి అప్పలరాజు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమణయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు.

న్యూస్‌రీల్

నేడు జీడి, మామిడి తోటలకు వేలం

రణస్థలం: శ్రీకాకుళం రేంజ్‌లో పొందూరు, తండ్యాం, లోలుగు, కొత్తకుంకాం, ఎండువ, జీరుకొవ్వాడ, బారువ, కొవ్వాడ మత్స్యలేశం, లక్ష్మీపురం, తామడ, లావేరు గ్రామాల్లోని అటవీ జీడి, మామిడి తోటలకు సోమవారం వేలం పాట నిర్వహించనున్నారు. అటవీ శాఖ జీడి, మామిడి తోటల ఫలం సాయం సేకరించి తీసుకుపోవటం గురించి విశాఖపట్నం ముఖ్య అటవీ సంరక్షణాధికారి ఆదేశాల ప్రకారం వేలం పాట వేస్తున్నామని కందివలస సెక్టార్ అటవీశాఖ సెక్షన్ అధికారి తలే శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 5వ తేదిన జిల్లా అటవీశాఖ కార్యాలయంలో బహిరంగ వేలం ఉంటుందని, అమ్ముడు కాని తోటలు ఈ నెల 14న, 24న మరోసారి వేలం వేస్తారని చెప్పారు. గుత్తే కాలం మార్చి 1వ తేదీ నుంచి జూన్ 30 వరకు అమలులో ఉంటుందని తెలిపారు. పాటదారుడు ధరావత్తు రూ.5వేలు నగదు తోపాటు అదనంగా రూ. 25వేలు చెల్లించాలని తెలిపారు. పాట ఖరారైన వ్యక్తి పాన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న వలంటీరు నాగం సింధు

ఎచ్చెర్ల: లావేరు మండలం గుమడాం సచివాలయం పరిధిలో వలంటీరు నాగం సింధు విజయవాడ వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ అందజేశారు. గుమడాం గ్రామానికి చెందిన యాలాల ఆదినారాయణ, నారాయణమ్మలు ఆరోగ్యం బాగాలేక విజయవాడ ఆస్పత్రికి వెళ్లి అక్కడే ఉంటున్నారు. ఫిబ్రవరి పింఛన్ ఇవ్వాల్సి ఉన్నందున వలంటీరు సింధు విజయవాడ వెళ్లి ఆదినారాయణకు వృద్ధాప్య పింఛను, నారాయణమ్మకు అభయహస్తం పింఛన్లు పంపిణీ చేశారు.

అరసవల్లిలో భక్తుల సందడి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని పుష్యమాస ఆదివారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక, విశిష్ట దర్శనాల మార్గాలతో పాటు ఉచిత దర్శన మార్గాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇక అంతరాలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఉచిత మంచినీరు, ఉచిత వైద్య సదుపాయాలతో పాటు ఉచిత ప్రసాదాలను కూడా ఆలయ సిబ్బంది పంపిణీ చేశారు. పలువురు జిల్లా స్థాయి అధికారులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.90,500, విరాళాల ద్వారా రూ.71,954, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లుగా ఈఓ తెలియజేశారు.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 89వ నెలవారీ సాహితీ సమ్మేళనం చక్కగా ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో 14మంది కవులు సామాజిక పరమైన కవితలు చదివారు. ముందుగా తెరవే కార్యదర్శి రమణమూర్తి తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు తవిటన్న పట్నాయక్ మృతికి నివాళులు అర్పించారు. కవి సమ్మేళనంలో కవులు బి.కోమలరావు, నిక్కు హరిసత్యనారాయణ, చాడ శ్రీనివాస్, తంగి ఎర్రమ్మ, రెడ్డి లలిత, బి.జగన్నాథరావు, తోట గోపాలరావు, ఐఎన్‌డీ ప్రసాదరావు, మంగిపూడి శ్రీనివాసరావు, పీవీ దుర్గాప్రసాద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కొనలేదని ఆత్మహత్య

రణస్థలం: సెల్‌ఫోన్ కొనలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇరవై రోజులు చావుతో పోరాటం చేసి కన్నుమూశాడు. మండలంలోని వీఎస్ పురం పంచాయతీలో గల సురాపురం గ్రామానికి చెందిన గురివిల్లి భాస్కరరావు(18) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భాస్కరరావు సెల్‌ఫోన్ కావాలని ఇంటిలో అల్లరి చేసేవాడు. కొనలేదనే కోపంతో గత నెల 15న గడ్డిమందు తాగేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు రణస్థలం సీహెచ్‌సీలో చేర్పించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి భాస్కరరావు మృతి చెందాడు. టచ్ ఫోన్ కొనలేదనే కారణంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని తండ్రి నీలయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.





కోలాటం ఆడుతున్న మహిళలు

సహస్ర కోలాట విన్యాసం

1050 మంది మహిళలు.. 12 పాటలు.. 20 నిమిషాలు.. కలగలిపి ఓ అద్భుత కళా విన్యాసం ఆవిష్కృతమైంది. శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం ఈ అపురూప వైభవానికి వేదికైంది. వెయ్యి మంది మహిళలు ఒక్క చోటకు చేరి లయబద్ధంగా ఆడిన కోలాటం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదైంది. కళింగ వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం రక్తికట్టింది.

- 1050 మందితో కోలాటం
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు
- 20 నిమిషాలు సాగిన ప్రదర్శన



వీక్షిస్తున్న వరల్డ్ రికార్డు ప్రతినిధులు, సంఘం నాయకులు



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్లతో మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో కళింగ వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు నమోదుకు సహస్ర కోలాట ప్రదర్శన ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ఎస్పీ జీఆర్ రాధిక విచ్చేసి మాట్లాడారు. సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించి నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. మహిళా సంఘం సభ్యులంతా కలసి వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమం చేపడితే బాగుంటుందని, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమెను కళింగ వైశ్య మహిళా సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలు కనుమరుగవుతున్న వేళ నిర్వహించిన ఈ కార్యక్రమం తెలుగు వారి సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచిందన్నారు. అపురూప రీతిలో సాగిన ఈ కార్యక్రమం కళింగ వైశ్య సామాజిక చరిత్రలో ముఖ్యమైన ఘట్టమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను, జిల్లా అధ్యక్షుడు తంగుడు నాగేశ్వరరావు, ఊన్న నాగరాజు, కోరాడ హరగోపాల్, కోరాడ రమేష్, జామి భీమశంకర్, బోయిన గోవిందరాజులతో పాటుగా మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లా పద్మజ, లాడె శాంతి ప్రియ, ట్రెజరర్ తంగుడు జ్యోల, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళాసు కవిత, పీఆర్‌ఓ కిల్లాం శెట్టి తిరుమల శ్రీదేవి, బోర్డు ఆఫ్ చైర్మన్ కోరాడ ఆశాలత, ఊణ్ణ రాజశ్రీ, కిల్లం శెట్టి రాణి, కిల్లంశెట్టి ధనలక్ష్మి, కోరాడ పద్మజ, బోయిన త్రివేణి, బోయిన దివ్య తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు నమోదు

20నిమిషాల పాటు 12 పాటల మిక్సింగ్‌తో 1050మంది మహిళలతో ప్రదర్శన ఇచ్చారు. గ్రౌండ్‌లో నూరు సర్కిల్స్ ఏర్పాటు చేసి, ఒక్కో సర్కిల్‌లో 10మంది గ్రూపుగా ప్రదర్శన ఇచ్చారు. వీరందరూ డ్రస్ కోడ్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధి పాల్గొని ఈ ప్రదర్శనను రికార్డు చేశారు.

ఆనందంగా ఉంది



ఈ రోజుకోసం మేము గత ఆరుమాసాలుగా ఎదురుచూశాం. ఎంతో ఆనందంగా ఉంది. ఒక క్రమశిక్షణతో కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించాం. అంధవరపు సూరిబాబు, కోణార్క్ శ్రీను చేసిన సాయానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– మల్లా పద్మజ, ప్రెసిడెంట్, కళింగ వైశ్య మహిళా సంఘం

కష్టానికి ఫలితం దక్కింది



కష్టానికి తగ్గ ఫలితం ఈ రోజు దక్కింది. వీరందరినీ కూడగట్టి ఒక చోట చేర్చడానికి ఎంతో వ్యయప్రయాసలు పడ్డాం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ అందుకునేటప్పుడు అందరం ఎంతో ఆనంద పడ్డాం. దీని వెనుక ఎంతో మంది సహకారం ఉంది.

– తంగుడు జ్యోల, ట్రెజరర్, కళింగ వైశ్య మహిళా సంఘం

ఆమెదే ఆధిపత్యం

- జిల్లాలో కీలకంగా మారనున్న మహిళా ఓటర్లు
- అన్ని నియోజకవర్గాల్లోనూ వారిదే పైచేయి



ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	వ్యత్యాసం
ఇచ్ఛాపురం	1,29,579	1,36,427	6,848
పలాస	1,06,817	1,11,365	548
టెక్కలి	1,16,944	1,17,383	439
పాతపట్నం	1,11,301	1,11,843	542
శ్రీకాకుళం	1,33,772	1,36,252	2,480
ఆమదాలవలస	95,539	97,005	1,466
ఎచ్చెర్ల	1,22,169	1,20,455	1,714
నరసన్నపేట	1,06,321	1,06,599	278
మొత్తం	922442	937329	14,887

వయస్సుల వారీగా ఓటర్ల సంఖ్య

వయస్సు	పురుషులు	స్త్రీలు	వ్యత్యాసం
40–49	1,96,527	2,07,114	10,587
50–59	1,44,370	1,61,167	16,797
60–69	92,704	1,00,583	7,879
70–79	44,314	50,331	6,017
80–89	10,783	15,135	4,352
90–99	1,107	1,967	860
100–109	19	31	12

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న ఎన్నికల్లో మహిళలు కీలక పాత్ర పోషించనున్నారు. జిల్లాలోని ఓటర్ల జాబితా పరిశీలిస్తే.. మహిళా ఓటర్ల సంఖ్యే అన్ని వర్గాల్లోనూ ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే 14,883 మంది మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉన్నారు. ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల పరిధిలో వారి ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ తేడా వందల్లో మాత్రమే ఉంది.

ఓటర్ల జాబితా ప్రకారం ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు 1016 మంది స్త్రీ ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ (ఎస్ఎస్ఆర్2024) జాబితాలో మార్పులు, చేర్పులు ఇతర సవరణల అనంతరం జిల్లాలో 18,59,910 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. జిల్లాలో ఉన్న 30 మండలాలు, 8 శాసన సభా నియోజకవర్గాల పరిధిలో 9,22,442 మంది పురుష ఓటర్లు, 9,37,329 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జండర్ 139 మంది ఉన్నారు. దివ్యాంగులు కూడా ఈ సారి ఎన్నికల్లో కీలకంగా ఉన్నారు. జిల్లాలో అన్ని నియోకవర్గాలు కలిపి 20,732 మంది దివ్యాంగులు ఉన్నారు. ఎక్కువగా ఎచ్చెర్ల నియోజకవర్గంలో 3,054 మంది ఉన్నారు.

వయసు పైబడిన వారిలోనూ..

జిల్లాలో 40 ఏళ్ల పైబడిన వయస్సు గల స్త్రీ ఓటర్లు ఎక్కువ ఉన్నారు. 18 నుంచి 39 ఏళ్ల లోపు ఓటర్లలో పురుషులు ఎక్కువగా ఉన్నారు. 40 ఏళ్ల పైబడిన ఓటర్లలో పురుషుల కంటే మహిళలు 46,504 మంది ఎక్కువ ఉన్నారు.

'మత్స్యకార గ్రామాలకు రోడ్లు వేశాం'



పూర్తయిన బీటీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలైన మత్స్యకార గ్రామాలన్నింటికీ బీటీ రోడ్లు వేశామని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సీఎస్పీ రోడ్డు నుంచి కొర్ని, కొర్లాం, కొమరవానిపేటను కలిపే రోడ్డును రూ.1.40 కోట్లతో పూర్తి చేశారు. ఈ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. జనం బాగు కోసం ఐదేళ్లుగా లక్షలాది రూపాయలు నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. కొమరవానిపేట గ్రామానికి తన హయాంలో చాలా పనులు చేశామన్నారు. గ్రామంలో తుపాను షెల్టర్, మంచినీటి పథకం, బందరువానిపేటను కలిపే బీటీ రోడ్డు, కొమరవానిపేటకు ప్రత్యేక పంచాయతీ, ప్రత్యేక రేషన్ దుకాణం, వెల్‌నెస్ సెంటర్ ఇలా ఎన్నో చేశామని, మాయ మాటలు చెప్పేవాళ్లని నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, పార్టీ కన్వీనర్ పీస గోపి, పీస శ్రీహరిరావు, సర్పంచ్ వారాధి రవి, దాసరి పోలయ్య, బాబూరావు, దత్తాత్రేయ, పుక్కళ్ల పేరయ్య, తెనుకోటి అప్పారావు, ముంజేటి కృష్ణమూర్తి, రామారావు, బి.లలిత, మార్పు పృథ్వీరాజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో జిల్లా అభివృద్ధి శూన్యం



ఆసరా సంబరంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

నరసన్నపేట: టీడీపీ హయాంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యమని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే జిల్లాలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అభివృద్ధిపై చర్చకు వస్తే ఏం చేశామో వివరిస్తామని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో ఆసరా సంబరాల ముగింపు సభ నరసన్నపేట పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుల తీరును కృష్ణదాస్ దుయ్యబట్టారు. జనం అధికారమిస్తే సొంత ఆస్తులు పెంచుకున్నారని దుమ్మెత్తిపోశారు. వైఎస్సార్ తర్వాత వైఎస్ జగన్ హయాంలోనే జిల్లాలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. పనులు కనిపిస్తున్నా టీడీపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయాల్లో ప్రతి ఒక్కరికీ గెలుపు ఓటములు ఉంటాయని, దానికి మీరు అతీతులు కారని అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడులను ఉద్దేశించి అన్నారు. మీకు ఇవే చివరి ఎన్నికలని అన్నారు. సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ తనను టీడీపీ నాయకులు వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని, జనమే ఆలోచించాలని అన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో పోలాకి, నరసన్నపేట జెడ్పీటీసీలు ధర్మాన కృష్ణ చైతన్య, చింతు అన్నపూర్ణ, ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు పనుల పరిశీలన



బ్రేక్ వాటర్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సంతబొమ్మాళి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నౌపడలో పునరావాస కాలనీలను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కుమార్ కలసి ఆదివారం పరిశీలించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ మూలపేటలో పర్యటించి పోర్టులో జరుగుతున్న పనులను పోర్టు మేనేజర్ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. నార్త్ బ్రేక్, సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం పనులను సముద్రంలోకి వెళ్లి పరిశీలించారు.

తీరంలో చేపడుతున్న సివిల్ వర్క్, పోర్టు అప్రోచ్ రోడ్డు, పోర్టు డిజైనింగ్ మ్యాప్ సహాయంతో పరిశీలించారు. అనంతరం నౌపడలో పునరావాస కాలనీ పరిశీలించారు. ప్లాట్లు గుర్తించి నిర్వాసితులకు అందజేసేందుకు త్వరితగతిన కాలనీ సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డిటి ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ మౌళి, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

'కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి'



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎంఆర్ జ్యోతి ఫెడరిక్ అధ్యక్షతన ఆదివారం కళాశాల సెమినార్ హాల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు, జ్యోతి ఫెడరిక్ తదితరులు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు దాతలు సహకరించాలని కోరారు. ఇక్కడ చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారు బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియను సోమవారం ఉదయం 8 గంటల నుంచి అనివేటి మండపంలో నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు గ్రామపెద్దలు, ఆలయ పాలకమండలి సభ్యులు, పలు కీలక ప్రభుత్వ శాఖాధికారుల సమక్షంలో హుండీలను తెరిపించి నిబంధనల ప్రకారం లెక్కింపును చేపడతామని వివరించారు. రథసప్తమి పర్వదినానికి ముందు హుండీ లెక్కింపు చేపట్టడంతో మొక్కుల చెల్లింపులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని ఈఓ తెలిపారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



జాతీయ రహదారి పక్కన బోల్తా పడిన ఆటో

మందస: మండలంలోని హరిపురం సమీపంలో గల జాతీయ రహదారిపై ఆదివారం ఓ ఆటో బోల్తాపడి పలువురికి గాయాలయ్యాయి. సంతబొమ్మాళి మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన మహిళలు కవిటి మండలంలోని బొరివంక గ్రామంలో గల అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కకు బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న 11 మంది గాయాలయ్యాయి. వీరందరినీ హైవే అంబులెన్స్‌లో హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. వీరిలో వై.త్రిగుణ అనే బాలుడితో పాటు లక్ష్మి, వరలక్ష్మి అనే మహిళలకు టెక్కలి ప్రభుత్వాస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు.

పద్మావతమ్మ నేత్రాలు సజీవం



నేత్రదానం చేసిన పద్మావతమ్మ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం డే అండ్ నైట్ కూడలి వద్దగల ఫారెస్టు ఆఫీసు దరిలో గల కనుగుల వెంకట పద్మావతమ్మ(85) నేత్రదానం చేసి ఆదర్శవంతంగా నిలిచారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, రెడ్‌క్రాస్ సభ్యులు కనుగుల దుర్గా శ్రీనివాసరావు మాతృమూర్తి పద్మావతమ్మ మృతి చెందారు. ఆమె కుమారుడు శ్రీనివాసరావు తల్లి నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకుని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా ఆమె కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వాళ్లు 7842699321 నంబర్‌కు కాల్ చేయాలని జగన్మోహనరావు తెలిపారు.

'జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి'



ప్రజాసంఘాల ఐక్య వేదిక సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఉద్దానంలో పండుతున్న జీడిపంటకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలువురు కోరారు. పలాస మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయనను ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకునివెళ్లి ఉద్దాన దేశి జీడిపంటకు మద్దతు ధర ప్రకటించేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో పౌర హక్కుల జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్, కార్యదర్శి పిండి వెంకట్రావు, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం జిల్లా బాధ్యులు సాలిని వీరాస్వామి, భీమారావు రెండు సంఘాల సభ్యులు రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణించి సంస్థను ఆదరించాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరాజు కోరారు. శ్రీకాకుళం-1 డిపో పరిధిలోని పలు మార్గాల్లో నడుస్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణం చేసి గిఫ్ట్ స్కీమ్‌లో ఎంపికైన ప్రయాణికులకు ఆదివారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 16 నుంచి 31 వరకు ఒకటో డిపోకి చెందిన పల్లె వెలుగు బస్సుల్లో ఆమదాలవలస, చీపురుపల్లి, బందరువాని పేట, సాలూరు రూట్లలో ప్రయాణం చేసిన ప్రయాణికులు గిఫ్ట్ బాక్స్‌లో వేసిన టికెట్ల ఆధారంగా తీసిన డ్రాలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఎల్.ఎస్. నాయుడు, ఎంపీ రావు, సుమన్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల విజేత నెల్లిమర్ల

కంచిలి: మండలంలోని గోకర్ణపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మీతో స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో విజేతగా విజయనగరం జిల్లా నెల్లిమర్ల జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో మందస మండలం రట్టి జట్టు, తృతీయ స్థానంలో కవిటి మండలం చింతామణి జట్టు నిలిచాయి. ఈ పోటీల్లో మొత్తం 35 టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతలకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ యారడి కృష్ణమూర్తి, సోంపేట ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, సర్పంచ్ యారడి ఆనందరావు, జెడ్పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ బాపూజీల చేతులమీదుగా బహుమతులు అందించారు.

తల్లిదండ్రులు దూరం..

భవిత భారం

- రోడ్డు ప్రమాదంలో అమ్మానాన్నలను కోల్పోయిన చిన్నారులు
- భవిష్యత్ అంధకారమయం
- దాతల సాయం కోరుతున్న బిడ్డలు



తల్లిదండ్రులతో కుమారులు (ఫైల్)



నిరుపేదలైన సంరక్షకులతో ఉంటున్న అన్నదమ్ములు

నలుగురు కుటుంబ సభ్యులు. ఒక చిన్న టిఫిన్ దుకాణం. కడుపు నిండేంత సంపాదన. రోజులు హాయిగా గడిచి పోయేవి. ఈ సంక్రాంతి వరకు ఆ ఇల్లు అలాగే కనిపించింది. కానీ దేవుడి రాత మరోలా ఉంది. అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబంలో ఇద్దరిని తీసుకెళ్లిపోయింది. నిన్నటి వరకు అన్నం పెట్టిన అమ్మ, నీడై పెంచిన నాన్న ఇద్దరూ ఆ బిడ్డలకు దూరమైపోయారు. ఏం చేయాలో తెలీని పరిస్థితుల్లో ఆ ఇద్దరు పిల్లలు దాతల సాయం కోరుతున్నారు. రేపటిపై ఆశ కోసం మనసున్న వారి చేయూత ఆశిస్తున్నారు.

పొందూరు: మండలంలోని మలకాం గ్రామానికి చెందిన కొండేటి శంకరరావు, ఝాన్సీరాణి దంపతులకు పదో తరగతి చదువుతున్న దుర్గాప్రసాద్, ఏడో తరగతి చదువుతున్న సాయిశరత్‌లు ఉన్నారు. వీరు పొట్టకూటి కోసం ఎచ్చెర్లలో చిన్న టిఫిన్ దుకాణం పెట్టుకుని జీవించేవారు. గత నెల 17న విశాఖపట్నం సమీపంలోని ఆనందపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్గాప్రసాద్‌కు కాలు విరిగిపోగా, తల్లిదండ్రులకు తీవ్రగాయాలయ్యాయి. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయారు. దీంతో ఆ చిన్నారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం దుర్గాప్రసాద్ చికిత్స పొందుతున్నాడు. తమ చదువులు సాగేదెలాగో తెలీక భయపడుతున్నారు.

నిరుపేద కుటుంబం

దుర్గాప్రసాద్, సాయిశరత్‌లు నిరుపేద కుటుంబానికి చెందిన వారు. తల్లిదండ్రులను కోల్పోయిన తర్వాత వారి కంటే నిరుపేదలైన పెద్దనాన్న కొండేటి సోంబాబు, పెద్దమ్మ శారదలు పిల్లలను పెద్ద మనసుతో అక్కున చేర్చుకున్నారు. వీరు చుట్టలు చుట్టుకుని పొట్ట నింపుకుంటున్నారు. ఆ సంపాదన వారికే సరిపోదు.

ఈ ఇద్దరు పిల్లలను పోషించడం, చదువు బాధ్యతలు చూసుకోవడం వారికి తలకుమించిన భారం. అందుకే తమని ఆదుకునే మానవతావాదుల కోసం ఆ పిల్లలు ఎదురు చూస్తున్నారు.

సాయం చేయండి



మా పెద్దనాన్న, పెద్దమ్మలు నిరుపేదలు. చుట్టలు చుడుతూ, ఐస్ అమ్ముతూ బతుకుతున్నారు. మాకు తిండి పెడుతూ వారు పస్తులుంటున్నారు. మా చదువులు ఎలా సాగుతాయో, మా జీవితం ఎలా ముందుకు పోతుందోనని ఆందోళనగా ఉంది. దాతలు ఆదుకుంటారని ఆశిస్తున్నాం. సాయం చేయాలనుకునే వారు 9912474629 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నాం.

– కొండేటి దుర్గాప్రసాద్, సాయిశరత్, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, మలకాం

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న పిరియా విజయ, నర్తు రామారావు



కవిటి: మాణిక్యపురం పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న పిరియా విజయ తదితరులు

- జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ
- మాణిక్యపురం, ఈదుపురం పీహెచ్‌సీల ప్రారంభోత్సవం

కవిటి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. కవిటి మండలంలోని మాణిక్యపురం, ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం గ్రామాల్లో నిర్మించిన పీహెచ్‌సీలను ఆమె ఆదివారం ప్రారంభించారు. మాణిక్యపురంలో ఆమె మాట్లాడుతూ సీఎం పాలన ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్ కుమార్ అగర్వాల్, కడియాల ప్రకాష్, పీఏసీఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు, ఎన్ని అశోక్, పి.ఎం తిలక్, కృష్ణరాళో, వై.నీలయ్య, సర్పంచ్ శ్రీమతి లలిత సాహు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు సత్యవతి సాహు తదితరులు పాల్గొన్నారు.

ఈదుపురంలో..

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శివారు గ్రామాలకు సైతం వైద్య సేవలు అందజేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆదివారం ఆమె మండలం ఈదుపురం గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ హయాంలో కునారిల్లిపోయిన భవనాలకు వైఎస్సార్ సీపీ జీవం పోసిందని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో సైతం వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. దశాబ్దాల కాలంగా ఈదుపురం చుట్టు ప్రక్కల గ్రామస్తులు ఎదురు చూస్తున్న ఆస్పత్రి జగనన్న ప్రభుత్వంలో ప్రారంభం కావడం ఆనందదాయకమన్నారు.

సర్పంచ్ నర్తు వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, వైస్ ఎంపీపీలు దువ్వు వివేకానంద రెడ్డి, దున్న గురుమూర్తి, మండల, మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు పి.రాజశేఖరరెడ్డి, బి.ప్రకాశ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ



నడగాం రామాలయంలో దొంగలు తెరిచిన బీరువా

నరసన్నపేట: నడగాం, ఉర్లాం గ్రామాల్లోని రెండు ఆలయాల్లో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. నడగాం రామాలయంలో వేసిన తాళాలు విరగ్గొట్టి ఆలయంలో ఉన్న రెండున్నర కిలోల దేవుని వెండి ఆభరణాలు, తులంన్నర బంగారు వస్తువులు దొంగిలించారు. ఈ మేరకు ఆలయ పూజారి నేతేటి గోవిందరావు తెలిపారు. వేకువజామున గ్రామానికి చెందిన హరేకృష్ణ భక్తులు ఆలయం వద్దకు వెళ్లే సరికి తాళాలు తీసి ఉండటాన్ని గుర్తించి పూజారికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన ఆలయం వద్దకు వెళ్లి చూసే సరికి అన్ని తాళాలు విరగ్గొట్టి కనిపించాయి. స్వామి అలంకరణకు ఒక్క ఆభరణం కూడా లేకుండా అన్నీ దొంగిలించారు. అలాగే ఉర్లాంలోని శ్రీ కృష్ణాలయంలో కూడా దొంగలు పడ్డారు. పూజారి రమేష్ శర్మ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా హుండీ తెరవడం లేదని, దీన్ని కొల్లగొట్టారని దీంట్లో సుమారుగా రూ. 15 వేలు ఉండవచ్చని తెలిపారు. చిల్లర, చిరిగిన, చెద పట్టిన నోట్లు విడిచి పెట్టి మిగిలిన నగదును ఎత్తుకుపోయారని చెప్పారు. చోరీ సమాచారం తెలుసుకున్న నరసన్నపేట సీఐ బూర ప్రసాద్ రెండు ఆలయాలను పరిశీలించారు. వేలిముద్రల నిపుణుల బృందం వచ్చి వేలిముద్రలు సేకరించారు. చోరీలకు సంబంధించి ఆలయ అర్చకులు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విలువైన వస్తువులు ఆలయాల్లో ఉంచవద్దని అర్చకులకు, ఆలయ కమిటీ ప్రతినిధులకు సూచించారు. ఈ చోరీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాల వ్యాను బోల్తా



మున్సిపల్ కార్యాలయం సమీపంలో బోల్తా పడిన వ్యాను

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని పాతబస్టాండు నగర మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఆదివారం ఉదయం స్కూటీని తప్పించే క్రమంలో పాల వ్యాను బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న బాలుడికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. బూర్జ మండలానికి చెందిన సైరిగాపు హరిప్రసాద్ (17) సంతోషిమాత గుడి సమీపంలో ఉన్న తన మేనమామ ఇంట్లో నివాసముంటూ నగరంలో ఐటీఐ చదువుతున్నాడు. రోజూలాగే ఏడురోడ్ల కూడలిలో ఉన్న మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వాకింగ్ చేయడానికి ఉదయం స్కూటీపై తన మేనమామతో బయల్దేరాడు. ఈ క్రమంలో మున్సిపల్ కార్యాలయానికి వచ్చేసరికి వెనుకగా వచ్చిన ఆరోగ్య పాల వ్యాను స్కూటీని తప్పించి అదే ఉదుటున డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. అప్పటికే వెనుకగా వస్తున్న స్కూటీ వ్యానును ఢీకొట్టడంతో హరిప్రసాద్ రోడ్డుపై పడిపోయాడు. దీంతో వెంటనే అతడిని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ పేర్కొన్నారు.

దట్టంగా పొగమంచు



జాతీయ రహదారిపై మంచు ప్రభావం

ఎచ్చెర్ల క్యాంపస్: పొగమంచు భయపెడుతోంది. ఉదయం ఎనిమిది గంటల వరకు వీడకుండా కమ్ముకుంటోంది. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు.

బైక్, లారీ ఢీ



లారీ కింద పడి ఉన్న ద్విచక్రవాహనం

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం ఓ లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నౌపడ నుంచి టెక్కలి వైపు వస్తున్న ఒక లారీ స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్దకు వచ్చే సరికి ఎదురుగా ఒక ప్రైవేట్ బస్సు ఆగి ఉండటంతో దాన్ని తప్పించుకుని వెళ్తూ ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న చేరివీధికి చెందిన డి.రాజేష్, బబ్బులు అనే ఇద్దరు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు లారీ డ్రైవర్‌పై దాడి చేశారు. ఆయన లారీ వదిలి పరుగులు తీయడంతో 15 నిమిషాల పాటు ట్రాఫిక్ ఆగిపోయింది. అనంతరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను సరిచేశారు.

'మీ సేవలు నిరుపమానం'



బదిలీ అయిన అధికారులతో ఎస్పీ రాధిక, ఇతర పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : బదిలీపై వెళ్తున్న పోలీసు అధికారులు జిల్లాలో నిరుపమాన సేవలు అందించారని ఎస్పీ జీఆర్ రాధిక ప్రశంసించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్తున్న అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు (క్రైమ్), జె.తిప్పేస్వామి (అడ్మిన్)లతో పాటు డీఎస్పీలు కె.బాలరాజు (స్పెషల్ బ్రాంచి), ఎస్.వాసుదేవ్ (దిశ), సీహెచ్ జీవీ ప్రసాద్ (ట్రాఫిక్), సీఐలు ఎస్.ఆదాం, ఆర్ఈ సీహెచ్ ఈశ్వర్‌ప్రసాద్, దాలిబాబు, లక్ష్మణరావు, ఆర్ఐ ఉమామహేశ్వరరావులను ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బదిలీ అనేది ప్రతి ఉద్యోగికి తప్పదని, ఎక్కడ పనిచేసినా మీరందించే సేవలే గుర్తింపు తెస్తాయన్నారు. అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో మూడున్నరేళ్ల పాటు పనిచేయడం, ప్రతి అధికారి సహకరించడం తన అదృష్టమన్నారు. అదనపు ఎస్పీ తిప్పేస్వామి మాట్లాడుతూ మనమందరం అంకితభావంతో పని చేస్తే మన జిల్లా యూనిట్ ఆఫీస్‌కు మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయని,తన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవా పతకానికి తనను నామినేట్ చేసిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగేశ్వరరెడ్డి, బాలచంద్రారెడ్డి, శృతి, సీఐలు వేణుగోపాల్, పైడయ్య, అవతారం, ప్రసాదరావు, మల్లేశ్వరరావు, చంద్రమౌళి, జి.ఉమామహేశ్వరరావు, ఈశ్వరరావు, ఎస్పీ సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్, అదనపు ఎస్పీల సీసీలు సాయి కుమార్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపోటా నూతన కార్యవర్గం ఎన్నిక



అపోటా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కంచిలి: ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా భాస్కర పాఢి ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అపోటా ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ బరాడో అధ్యక్షతన సర్వసాధారణ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియను చేపట్టారు. ఎన్నికల అధికారులుగా అపోటా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కైలాస్ చంద్రనాయక్, రవి నారాయణ చౌధురీ వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా భాస్కర పాఢి, ఉపాధ్యక్షులుగా రామహరి పాఢి, సురేంద్ర పండి, ప్రధాన కార్యదర్శిగా బృందావన్ దొళాయి, సంయుక్త కార్యదర్శులుగా బేసి కృష్ణమూర్తి, సుదర్శన బెహరా, సహాయక కార్యదర్శిలుగా జయరాం మాళి, ఎన్. రవి కుమార్, ఆడిటర్‌గా గోవిందరాజ్ నల్ల, సహాయక ఆడిటర్‌గా పి.లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీటీఎఫ్ జిల్లాశాఖ నూతన కార్యవర్గం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ మందిరంలో జరిగిన ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో సంఘాన్ని ముందుండి నడిపిస్తున్న మజ్జి మదన్ మోహన్‌ను ముచ్చటగా మూడోసారి జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వి అనీల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.త్రినాథరావు, రాష్ట్ర పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి వ్యవహరించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా పి.అప్పలనాయుడు, బి.ఢిల్లేశ్వర్‌రావు, జి.భీమారావు, టి.రాజ్యలక్ష్మి, కె.గోపికృష్ణ, బి.నేతాజీరావు (ప్రత్యేక ఆహ్వానితులు) కార్యదర్శులుగా, చావలి శ్రీనివాస్, ఎస్.చాణిక్య, వి.నవీన్‌కుమార్, దాసరి రామ్మోహనరావు, మక్కా గంగేశ్వరి, పప్పల తిరుమలరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా బల్ల సుభాష్‌బాబు, పైడి శ్రీరామమూర్తి, డి.చంద్రశేఖర్, ఎన్.శ్రీనివాసరావు, బొంతు అప్పలనాయుడు, జి.రాజేష్, కె.విజయ్ కుమార్, బి.శాంతి, ఎన్.నీలామోహన్, కె.శాంతారామ్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.సూర్యనారాయణ, సభ్యులుగా డి.శ్రీనివాసరావు, ఎస్.రామారావు, అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా ఎల్.కరుణాకర్, సభ్యులుగా ఎన్‌విఎస్ ప్రసాద్, ఎం.శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, పి.మోహన్‌రావు, ఎస్.జగన్నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారులు, పరిశీలికులు ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు.

పోరాటాలతో సమస్యల సాధన

అంతకుముందు జరిగిన ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ మాట్లాడుతూ సమరశీల పోరాటాలతోనే విద్యారంగాన్ని కాపాడుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి తదితరులు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని ఉపాధ్యాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యాయుడిపై ఉందని పేర్కొన్నారు.

శివసాగర్ బీచ్‌లో 'క్రష్ లవ్' సినిమా షూటింగ్



షూటింగ్ చేస్తున్న సినిమా యూనిట్ బృందం

వజ్రపుకొత్తూరు,వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఆదివారం క్రష్ లవ్ అనే సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అశ్విన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రధాన సన్నివేశాలను చిత్రీకరించారు. పలాసకు చెందిన నటుడు అమ్మరామకృష్ణ ప్రతినాయకుడిగా నటిస్తుండగా హీరోగా కౌశిక్, హీరోయిన్‌గా సాహితీ శ్రీనివాస్ నటిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం సిమ్ము వహిస్తుండగా ఫొటోగ్రఫీ బాధ్యతలను పలాసకు చెందిన పవన్ కందికుప్ప నిర్వర్తిస్తున్నారు. శివానీ కావూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో నటీనటులుగా పలాస ప్రాంతానికి చెందిన జామి శ్రీను, కోరాడ రాంప్రసాద్, దుర్గాకాంత్ గ్రీన్ ఆర్మీసభ్యులు దాసరి శ్రీనివాసరావు, నగిరి లక్ష్మీ హైమవతి ఉన్నారు.

చీటీ పాట నిర్వాహకుడిపై కేసు నమోదు

కొత్తూరు: కుంటిభద్రకు చెందిన ఎస్.జగదీశ్వరరావు చీటీ పాట డబ్బులు తిరిగి చెల్లించకుండా వారం కిందట ఇంటి నుంచి పరారైపోయాడు. అతనిపై అదే గ్రామానికి చెందిన అగతమూడి అఖిల్ కుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ ఎంఏ అహ్మద్ ఆదివారం చెప్పారు. జగదీశ్వరరావుకు ఫోన్ పే ద్వారా రూ.15.57 లక్షలు, మరో రూ. 50 లక్షలు నగదు రూపంలో చెల్లించినట్లు అఖిల్ కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అఖిల్ కుమార్‌తో పాటు కొత్తూరు, కుంటిభద్ర, ఎన్ఎన్ కాలనీల గ్రామాలతో పాటు పలు గ్రామాలకు చెందిన వారు కూడా డబ్బులిచ్చి మోసపోయినట్లు సమాచారం.

ఘనంగా సైన్స్ ఫెయిర్ ప్రారంభం



మెగా సైన్స్ ఫెయిర్‌లో తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో రెండు రోజుల పాటు జరగనున్న మెగా సైన్స్ ఫెయిర్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. డీఈఓ కె.వెంకటేశ్వరరావు సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథం అలవాటు చేసుకోవాలన్నారు.

తొలిరోజు రికార్డు స్థాయిలో ఒకే స్కూల్ నుంచి మొత్తం 554 మంది విద్యార్థుల భాగస్వామ్యంతో 335 నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించి సరికొత్త రికార్డును నెలకొల్పారు. సైన్స్ ఫెయిర్ ఉద్దేశాన్ని, విద్యార్థుల ప్రదర్శనల తీరును పాఠశాల డైరెక్టర్ అన్నేపు లావణ్యరాణి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, సైన్స్ ఫెయిర్ ఇంఛార్జి సౌజన్య, కో-ఆర్డినేటర్‌లు దీపాకుమారి, దేవి, విజయ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SITE FOR SALE

■ శ్రీకాకుళం జిల్లా PALASA, NH-16 హైవేలో SUDA/RERA ప్రాజెక్టులో 40" ROADS తో SIMPLEX / DUPLEX & OPEN SITES అందుబాటు ధరలో, బ్యాంక్‌లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్‌తో కూడిన వెంచర్లో ప్లాట్స్‌కై సంప్రదించండి. 8897711559, 8985174489. [S-1192433]

Services

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

■ Sri Avani Eco-Life Pvt Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా * బయో డిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారీగా డీలర్లు కావలెను. ఫోన్: 9493786468, 6301041696. [H-801665]

Wanted

WANTED

■ హైదరాబాదులోని ఆప్తా హోం కేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45వయస్సు గల M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 16-20వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ కలవు. Cont: 9381848549 [G-1652]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 91777 36926. [M-1233771]

■ జాబ్ గ్యారంటీ జీతం: 18-30 వేల వరకు, ఫ్రీరూం+భోజనం ఇచ్చి మహిళలు/పురుషులకు జాబ్స్. ఏజెంట్లు కావలెను. (1 మనిషికి 5000/- కమీషన్). ఫోన్: 9966310431. [HA-10848]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024/9640400073. [HA-1168]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40000, ఫ్రీ రూం+భోజనం HYD. PH: 7995984445. [HA-1188]

■ IRPM కంపెనీలో SKLMలో BMMTలో పర్మనెంటుగా పనిచేయుటకు. Q : 10th, Inter గల 25 సం॥లోపు. 48 మంది స్త్రీ/పు॥ ఉచితోద్యోగం. జీతం : 9500/- + ఫ్రీ రూం శిక్షణ తరవాత BMగా 25000/- + పైన సంపాదన. Int: ఈరోజు, రేపు. ఫోన్: 98495 53548 [V- 6390]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.